● పోస్టర్ ఆవిష్కరణ



బాల్య వివాహాలపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్‌ను శనివారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆవిష్కరించిన మేయర్ విజయలక్ష్మి.

మైక్ కెమెరాలతో రోడ్లపై చెత్త డంపింగ్‌కు చెక్

అంబర్‌పేట సర్కిల్ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హేమలత

ఇంటర్వ్యూ...



రాంనగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట సర్కిల్ పరిధిలోని ఐదు మున్సిపల్ డివిజన్లలో ప్రధాన కూడళ్లు, రహదారులు, కాలనీలలో ప్రజలు చెత్త వేయకుండా నివారించి వారికి అవగాహన కల్పించేందుకు నూతనంగా మైక్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు అంబర్‌పేట సర్కిల్ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వై.హేమలత తెలిపారు. ఈ మైక్ కెమెరాల ద్వారా రోడ్ల పక్కన చెత్త వేసే వారిని గుర్తించి వారికి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. చెత్తను స్వచ్ఛ ఆటోలకు ఇవ్వకుండా రోడ్ల పక్కన పడేసి వెళ్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో చెత్త వేసే ప్రాంతాలను గుర్తించి స్థానికుల సహకారంతో మైక్ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ఆమె 'ఆంధ్రజ్యోతి'తో ఈ వివరాలు వెల్లడించారు.

మైక్ కెమెరాలు ఎలా పని చేస్తాయి?

వాహనాలపై నుంచి వచ్చి కవర్లతో చెత్తను రోడ్లపై వేసే చర్యలను నివారించేందుకు మైక్ కెమెరాలు దోహదపడతాయి. ఈ కెమెరాలను రోడ్లపై చెత్త వేసే కూడళ్లను గుర్తించి స్థానికుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేశాం. ఎవరైనా చెత్త వేయడానికి వచ్చినప్పుడు ఆ కెమెరా అతడిని గమనించి వెంటనే ఇక్కడ చెత్త వేయవద్దని చెబుతుంది. దీని నిర్వహణకు సంబంధించి ఏఎంవోహెచ్, స్థానిక పోలీసులు, స్థానిక ప్రజలు, జీహెచ్‌ఎంసీ ఎస్‌ఎఫ్‌ఏలకు యాక్సెస్ ఇచ్చినట్లు వివరించారు.

సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు ఎక్కడెక్కడ మైక్ కెమెరాలు ఏర్పాటు చేశారు?

సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు గోల్నాక డివిజన్‌లోని తులసీనగర్, హిమాయత్‌నగర్ డివిజన్‌లోని రాజ్‌మోహల్లా, బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని బూర్జుగల్లీ, చే నంబర్ చౌరస్తాలో ఏర్పాటు చేశాం. వీటి కారణంగా మంచి ఫలితాలు కల్పిస్తున్నాయి. మైక్ కెమెరా హెచ్చరించినా చెత్త వేస్తే వారిని గుర్తించి వెయ్యి రూపాయల జరిమానా వేస్తాం.

మైక్ కెమెరాల ఏర్పాటుకు ఎంత ఖర్చవుతుంది, బాధ్యత ఎవరిది?

చెత్త వేసే ప్రాంతాలను గుర్తించి ఆ పరిసర ప్రాంతాలలోని స్థానికులను జీహెచ్‌ఎంసీ చే భాగస్వామ్యం చేసుకుని వాటిని ఏర్పాటు చేశాం. ఒక్కొక్క దానికి దాదాపు 10 వేల ఖర్చవుతుంది. ఎక్కడైనా మైక్ కెమెరాలు కావాలని కాలనీవాసులు తమను సంప్రదిస్తే ఏర్పాటు చేస్తాం.

నేడు రాష్ట్ర స్థాయి సదర్ సమ్మేళనం

ట్రాఫిక్ దారిమళ్లింపు, భారీ బందోబస్తు

రాంనగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ నేపథ్యంలో దీపావళి సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చాటిచెప్పే విధంగా మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ బృందం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ఇందిరాపార్కు ఎన్టీఆర్ స్టేడియంలో పెద్దఎత్తున నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, యూపీ మాజీ సీఎం అఖిలేష్‌యాదవ్ జాతీయ నాయకులు, స్థానిక కార్పొరేషన్ల చైర్మన్లు హాజరవుతున్న నేపథ్యంలో ఎన్టీఆర్ స్టేడియం వద్ద నిర్వాహకులు కటౌట్‌లు, భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వీఐపీలు అధిక సంఖ్యలో వస్తున్న నేపథ్యంలో పోలీసులు సదర్ జరిగే ప్రాంతాన్ని శనివారం తమ అదుపులోకి తీసుకుని రాకపోకలు నిలిపివేసి తనిఖీలు మొదలుపెట్టారు. ఎన్టీఆర్ స్టేడియం, ఇందిరాపార్కు తదితర ప్రాంతాల్లో సదర్ సమ్మేళనం సందడి నెలకొంది.



సదర్ సమ్మేళనానికి సిద్ధమైన గొర్రె పొట్టేళ్లతో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్

దున్నపోతులు, గొర్రె పొట్టేళ్ల సందడి

సదర్ సమ్మేళనం కోసం జంటనగరాలతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, పొరుగు రాష్ట్రాల నుంచి ప్రత్యేకత గల దున్నపోతులు, గొర్రె పొట్టేళ్లను తెప్పించారు. వీటితో ప్రత్యేకంగా దున్నపోతులు, పొట్టేళ్ల కార్నివాల్ ఏర్పాటు చేశారు. దీని కోసం ఏర్పాటు చేస్తున్నారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్‌లు శనివారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. దీపావళి సంస్కృతి, సంస్కృతి ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. సదర్ సమ్మేళనాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు రాజ్యసభసభ్యులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ వినతిపత్రం అందజేశారు. సమ్మేళనానికి హాజరయ్యే అతిథులు, ప్రజల కోసం నిర్వాహకులు పెద్దఎత్తున భోజన ఏర్పాట్లు నిర్వహించారు.

నేడు దేశభక్తి గీతాల పోటీ

ముషీరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో దేశభక్తిని పెంపొందించేందుకు ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో దేశభక్తి బృందగానం పోటీలను ఆదివారం నిర్వహిస్తున్నామని భారత్ వికాస్ పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సతీష్‌గౌడ్, నాగరాజులు తెలిపారు. శనివారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. బృందగానం పాటల పోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి 8 బృందాలు పాల్గొంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. ఈ పోటీలో ప్రతిభ కనబర్చిన చిన్నారులను డిసెంబర్ 15న బెంగళూరులో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు.

లోప్రెషర్ నీటి సమస్యను పరిష్కరించాలి

అంబర్‌పేట: అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో లోప్రెషర్ నీటి సమస్యను పరిష్కరించాలని బీజేవైఎం సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ కోరారు. లోప్రెషర్ సమస్యపై స్థానికులు యశ్వంత్‌కు ఫిర్యాదు చేయడంతో ప్రేమ్‌నగర్ బస్తీవాసులను శనివారం కలిసి సమస్యను అడిగి తెలుసుకున్నారు. బస్తీవాసులు రెండేళ్లుగా లోప్రెషర్ నీటి సమస్యను ఎదుర్కొంటున్నామని, జలమండలి అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, శోభ, శ్రీహరి పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

బర్కత్‌పుర: గుర్తు తెలియని మృతదేహాన్ని కాచిగూడ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. అడ్మిన్ ఎస్‌ఐ డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. 60 ఏళ్ల వయసు గల వృద్ధుడు కాచిగూడ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌లో మృతి చెంది ఉన్నాడు. విషయం గమనించిన ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించి అనారోగ్యంతో చనిపోయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణ

చిక్కడపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యమని చిక్కడపల్లి నూతన ఇన్‌స్పెక్టర్ బి.రాజునాయక్ తెలిపారు. బీజేపీ నాయకులు దోనేటి సత్యం ఆధ్వర్యంలో శనివారం ఇన్‌స్పెక్టర్ రాజునాయక్‌ను పీఎస్‌లో కలిసి సత్కరించారు. శివకుమార్, లక్ష్మీనారాయణ (బంటి) తదితరులు పాల్గొన్నారు.

రూ.1.35 కోట్లతో అభివృద్ధి పనులు

హాజరైన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్,

ముషీరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్‌లోని కోటీ 35 లక్షల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్‌లతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను వారికి ఫిర్యాదు చేశారు. ముషీరాబాద్ డివిజన్‌లోని ప్లేగ్రౌండ్‌లో రూ.56 లక్షలతో ఓపెన్ జిమ్, సిట్టింగ్ గ్యాలరీ, బాదంచెట్టు వీధిలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, రామాలయం వీధిలో రూ.20 లక్షలతో చేపట్టిన పద్మశాలి సంఘం భవన రెండో అంతస్తు నిర్మాణ పనులు, శ్మశానవాటికలో రూ.20 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను శనివారం ప్రారంభించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ముషీరాబాద్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిధులను విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. ముషీరాబాద్ సాగర్‌లాల్ ఆసుపత్రి వద్ద నిత్యం డ్రైనేజీ మురుగునీరు నిలిచిపోవడం వల్ల పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, టెంట్ హౌస్ శ్రీనివాస్, ముచ్చకుర్తి ప్రభాకర్, పూస గోరక్‌నాథ్, ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ రమేష్‌రాం తదితరులు పాల్గొన్నారు.



బాదం చెట్టు వీధిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్

ఎంపీ నిధులతో మౌలిక సదుపాయాలు

రాంనగర్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని శ్మశానవాటికలు, పార్కులు, క్రీడా మైదానాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ఎంపీ నిధుల కేటాయిస్తున్నట్లు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. శనివారం అడిక్‌మెట్ డివిజన్‌లోని లలితానగర్, అంబర్‌నగర్ శ్మశానవాటికలో ఎంపీ నిధులు రూ.20 లక్షల వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహలతో కలిసి కిషన్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. డీఎంసీ ఖాదర్ మొహినుద్దీన్, ఈఈ సన్ని, జ్యోతి, బీజేపీ నాయకులు ఆర్.శేషసాయి, నరేష్ పాల్గొన్నారు.

భారతీయ సంగీతం పరమపవిత్రం



తెలుగుబుక్ రికార్డును అందజేస్తున్న అతిథులు

చిక్కడపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంగీతం పరమపవిత్రమైనదని ఏపీ అధికార బాషా సంఘం పూర్వ చైర్మన్ పి.విజయబాబు అన్నారు. రఘు అరికపూడి సేవాట్రస్ట్, కళానిలయం ఆధ్వర్యంలో శనివారం రాత్రి త్యాగరాయ గానసభలో ప్రఖ్యాత కర్ణాటక సంగీత విద్వాంసురాలు ఎంఎస్ సుబ్బలక్ష్మి 108వ జయంతి సందర్భంగా 108 గాయనీగాయులతో శాస్త్రీయ సంగీత గాన గోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ.. సంగీతానికి ప్రతిరూపం సుబ్బలక్ష్మిఅన్నారు. గాయని హైమవతి బీమన్న మాట్లాడుతూ సుబ్బలక్ష్మి భారతరత్నగా కేంద్రప్రభుత్వంచే గుర్తింపు పొందిన ఏకైక శాస్త్రీయ సంగీత విదుషి అన్నారు. వంశీ రామరాజు, వైఎస్ఆర్ మూర్తి, ఎస్‌పి భారతి పాల్గొన్నారు.

రైతు కమిషన్ చైర్మన్‌కు ఘనసన్మానం



కోదండరెడ్డిని సన్మానిస్తున్న అభిషేక్‌రెడ్డి, కేశవ్, కన్నాడేనియల్ తదితరులు

చిక్కడపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే ఎం.కోదండరెడ్డిని సీనియర్ కాంగ్రెస్ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. బీఆర్‌కే భవన్‌కు చేరుకున్న బి.అభిషేక్‌రెడ్డి, జీవన్, కేశవ్, కన్నా డేనియల్, రామకృష్ణముదిరాజ్ తదితర నాయకులు కోదంరెడ్డిని కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధే ధ్యేయంగా కమిషన్ చైర్మన్‌గా తాను బాధ్యతలు నిర్వహిస్తానన్నారు.

ఉన్నత విద్యామండలి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఎమ్మెల్సీ కోదండరాం



కోదండరాంను సన్మానిస్తున్న పుచ్చయ్య, పుల్లయ్య, ఐలయ్య

రాంనగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యామండలి సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఉన్నత విద్యావ్యవస్థ విధ్వంసానికి గురైందని ఆరోపించారు. శనివారం విద్యానగర్ ఓయూ రోడ్డులోని ఆంధ్ర మహిళా సభ ఆడిటోరియంలో తెలంగాణ రిటైర్డ్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.పుచ్చయ్య, ఎ.పుల్లయ్యల ఆధ్వర్యంలో ఉన్నత విద్యా మండలిలోని సమస్యలపై సదస్సు, ఎమ్మెల్సీ కోదండరాంకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా రంగానికి అధిక నిధులు కేటాయించే విధంగా సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవిస్తామన్నారు. గౌరవ అతిథులుగా హాజరైన ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ విద్యారంగానికి నిధుల కేటాయింపులో తెలంగాణ 28వ స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పి.సుధాకర్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ టి.ప్రతాప్‌రెడ్డి, అసోసియేషన్ అసిస్టెంట్ సెక్రటరీ కె.ఐలయ్య ఎం.ధర్మేందర్‌రావు, డి.విజయప్రసాద్ పాల్గొన్నారు.

● బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన



ఎంఎన్‌జే ప్రభుత్వ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై నిర్వహించిన అవగాహన ర్యాలీలో బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొని ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సరోజ వివేక్ విద్యార్థులను అభినందించారు.
- రాంనగర్, ఆంధ్రజ్యోతి

● రోడ్డు పనుల పరిశీలన



బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని మల్లికార్జున్‌నగర్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న స్థానిక కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు.
- రాంనగర్, ఆంధ్రజ్యోతి

● నిరసన



ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు కేజ్రీవాల్‌పై జరిగిన దాడికి నిరసనగా తెలంగాణ పార్టీ నాయకులు ట్యాంక్‌బండ్‌పై గల అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు.

బస్తీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



బస్తీల సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

చిక్కడపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బస్తీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. శనివారం బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, పార్టీ నాయకులతో కలిసి మాలబస్తీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. బస్తీల్లో సివరేజీ పైప్‌లైన్, లోప్రెషర్ నీటి సమస్య, వెలగని వీధిదీపాలు తదితర సమస్యలపై బస్తీవాసులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మదన్‌మోహన్, అరుణ్‌కుమార్, సాయితేజ, భాను, మాలబస్తీ కమిటీ అధ్యక్షుడు మధుసూదన్, వెంకటేష్, సునీల్, అశ్విన్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై ప్రతిపక్షాలు ఏకం కావాలి

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ



మాట్లాడుతున్న పబ్బతి శ్రీకృష్ణ

నల్లకుంట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ తీసుకువస్తే ప్రతిపక్ష పార్టీలోని మాల ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నోరు ఎందుకు మెదపడంలేదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష ప్రశ్నించారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగర్ కర్నూలు జిల్లాలో ఆదివారం మాల ఉద్యోగులు నిర్వహిస్తున్న మాలల ఆత్మీయ సమ్మేళనంలో మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత పి.వి.రావు వారసులను ఆహ్వానించకపోవడం శోచనీయమన్నారు. వర్గీకరణను అడ్డుకోవడం కోసం అన్ని రాజకీయ పార్టీల మాల నేతలను ఏకీకృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు యేనమాల సుధాకర్, యాదయ్య, జానకి తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషాభివృద్ధికి సూర్యధనంజయ చేసిన కృషి మరువలేనిది



సూర్యధనంజయను సత్కరిస్తున్న రాజ్‌నారాయణ

బర్కత్‌పుర, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యం, మాతృభాషాభివృద్ధికి ప్రొఫెసర్ సూర్యధనంజయ ఎనలేకి కృషి చేస్తున్నారని తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ అన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఉప కులపతిగా పదవి బాధ్యతలు చేపట్టిన సూర్యధనంజయను శనివారం శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైస్ చాన్స్‌లర్‌గా నియమించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సూర్యధనంజయ తెలుగు సాహిత్యకారిణీగా పేరు సంపాదించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది డాక్టర్ ధనుంజయ్, ఓయూ పీడీఎఫ్ డాక్టర్ రవితేజ చౌహన్, ప్రొఫెసర్ సరస్వతమ్మ, నవ భారత్ నిర్మాణ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బత్తుల హేమన్, ఉజ్వల్‌చందర్ పాల్గొన్నారు.



కాచిగూడ ఆర్టీసీ డిపో పక్కన పేరుకుపోయిన చెత్త

చెత్తను వెంటనే తొలగించాలి

బర్కత్‌పుర, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ రైల్వేస్టేషన్ వెనుక భాగంలోని ఆర్టీసీ డిపో పక్కన చెత్త పేరుకుపోయి గుట్టగా పోగయింది. చెత్తను పూర్తిగా తొలగించాలని డిపో మేనేజర్ టి.రఘు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ డీఎంసీ మరుతిదివాకర్‌కు లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. చెత్త పేరుకుపోయిన ప్రాంతాన్ని రఘు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్త పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోందని, రోజుల తరబడి చెత్తను తరలించకపోవడం వల్ల ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కొంత మంది ఆటోలు, ఇతర వాహనాలలో చెత్తను తీసుకొచ్చి ఆర్టీసీ డిపో ప్రహరీ పక్కన పడేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో చెత్త వేయకుండా తగు చర్యలు తీసుకోవాలని, పేరుకుపోయిన చెత్తను తొలగించాలని కోరారు.

ఎక్సైజ్ స్టేషన్లను పునర్విభజన చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాచాల యుగంధర్‌గౌడ్ తదితరులు

నల్లకుంట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో అశాస్త్రీయంగా ఏర్పాటు చేసిన నూతన ఎక్సైజ్ స్టేషన్లను పునర్విభజన చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శిలను కలిసి వినతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో కొంతమంది సంఘం నాయకుల దురాలోచనతో కొంతమంది అధికారుల పోస్టింగ్‌లపై ఎలాంటి శాస్త్రీయతను పాటించకుండా అడ్డగోలుగా గ్రేటర్ హైదరాబాద్‌లోని ఎక్సైజ్ స్టేషన్లను విభజించారని ఆరోపించారు. కొత్త స్టేషన్ల ఏర్పాటులో శాస్త్రీయత లోపించిందన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన స్టేషన్లలో పోస్టులను మంజూరు చేయకుండా వివిధ జిల్లాల నుంచి హైదరాబాద్‌కు తరలించి కేటాయించడం సరైంది కాదన్నారు. 14 కొత్త ఎక్సైజ్ స్టేషన్ల ఏర్పాటు వల్ల ప్రభుత్వంపై అధిక ఆర్థిక భారం పడుతుందని తెలిపారు. పి.బడేసాబ్, సాయిబాబా, సుమన్, నగేష్, నవీన్ పాల్గొన్నారు.

చెన్నారెడ్డినగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం

అంబర్‌పేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ చెన్నారెడ్డినగర్‌లో డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయన చెన్నారెడ్డినగర్‌లో పాదయాత్ర చేసి బస్తీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీలో ప్రధానంగా ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జలమండలి ఏఈ మాజీద్, బస్తీవాసులు కృష్ణయ్య, రాజేష్, కరుణాకర్ పాల్గొన్నారు.

దేశ ఆర్థికాభివృద్ధిలో కాస్ట్, మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ కీలకం

కవాడిగూడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థికాభివృద్ధిలో కాస్ట్, మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ కీలకపాత్ర పోషిస్తుందని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆలిండియా అధ్యక్షుడు బిభూతి భూషణ్‌నాయక్ పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో కాస్ట్ మేనేజ్‌మెంట్ (సీఎంఏ) పాత్రపై శనివారం దోమలగూడలోని సీఎంఏ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కాస్ట్ మేనేజ్‌మెంట్, ఆడిటింగ్, ఫైనాన్షియల్, కన్సల్‌టెన్సీలో అవసరమైన నైపుణ్యాన్ని అందించడం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఐసెంఏఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ కె.సీ.హెచ్.ఏ.వి.ఎస్.మూర్తి సీఎంఏ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఎంప్లాయీస్ యూనియన్ మహాసభలు ప్రారంభం

రాంనగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ హైదరాబాద్ సికింద్రాబాద్ డివిజన్‌ల 23వ సంయుక్త మహాసభలు శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమయ్యాయి. 26, 27 తేదీల్లో జరిగే ఈ మహాసభల ప్రారంభసూచకంగా సుందరయ్యపార్కులో ఉద్యోగ కళాకారుల విప్లవగీతాలు, నినాదాల మధ్య సంఘం అధ్యక్షుడు మద్దిలేటి అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. ప్రధానకార్యదర్శి తిరుపతయ్య మాట్లాడుతూ దేశంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ ఆర్థిక, సామాజిక పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వరంగ సంస్థలు ముఖ్యంగా బీమా, బ్యాంకులు తదితర ఆర్థిక సంస్థలను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందన్నారు. శ్రీకాంత్ మిశ్రా, గుణశేఖర్, రవి, వేణుగోపాల్, రాజశేఖర్, సతీష్, సుజాత, రవీంద్రనాథ్, శ్రీనివాసన్, రఘు, మైథిలి, జిలానీ బాషా, ప్రతాప్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల అక్రెడిటేషన్ల జీవోను సవరించాలి



మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

నల్లకుంట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డులకు సంబంధించి నియమనిబంధనల మార్పు కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో 1359 లోపభూయిష్టంగా, ఏకపక్షంగా ఉందని, ఈ జీవోను వెంటనే సవరించి అన్ని జర్నలిస్టు సంఘాలకు, చిన్న పత్రికలకు, మహిళా జర్నలిస్టులకు అవకాశం కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య, ఉపాధ్యక్షుడు పులిపలుపుల ఆనందం, బండి విజయ్‌కుమార్, ఎల్లోయి ప్రభాకర్ తదితరులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం శనివారం సమర్పించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఇటు ప్రభుత్వానికి, అటు ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ గురుతర బాధ్యతను నిర్వర్తిస్తున్న జర్నలిస్టులు సమాజహితం కోసం పనిచేస్తూ ప్రభుత్వానికి సహకరిస్తున్నారన్నారు. జర్నలిస్టులకు గుర్తింపు కోసం అక్రెడిటేషన్ కార్డులను ఇస్తుందన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్.కె.సలీమా, చంద్రశేఖర్, రాజశేఖర్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ రమాదేవి, హెచ్‌యూజే కార్యనిర్వాహక కార్యదర్శి నాగవాణి, పి.విజయ పాల్గొన్నారు.